# ఏక కథా పితామహ



వర్షాల్లేక పంటలు పండని రోజుల్లో పెద్ద పెద్ద హరిదాసులకే పిలుపు లేకపోతే గురుబ్రహ్మాం లాంటి వాణ్ణి పిలిచి కథ చెప్పించుకునే దెవరు? అంత మాత్రాన గురుబ్రహ్మాం ఊరుకోలేదు. తనే  సంకల్పించాడు. హార్మోనీ సుబ్రహ్మణ్యం దగ్గరకెళ్ళి 'ఓ వారం వరస కథలున్నాయి వస్తావా?' అనడిగాడు. సుబ్రహ్మణ్యం హార్మోనీ వాయించటంతోపాటు వంట కూడా చేస్తాడు కనుక రెండందాలా ఉపయోగం 'నువ్వు ఏవూళ్ళో చెప్పినా ఒక కథే కదయ్యా : రెండో కథ చెప్పనిస్తారా?' అన్నాడు సుబ్రహ్మణ్యం. 'నువ్వు అపశకునం మాటలు మాట్లాడకు. గ్రామస్థులు  మెచ్చాలేగాని వారమేమిటి. నెల సాగొచ్చు. రెణ్ణెల్లు మూణ్ణెల్లు! భారతమయ్యాక రామాయణం... ఇలా సంవత్సరం నడిస్తే ఆశ్చర్యమా!' అంటూ దిమ్మరపోయేట్టు చెప్పాడు గురుబ్రహ్మాం. "మరి మద్దెలో?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మన పూర్ణయ్యని తీసికెళ్దాం" అన్నాడు దాసు.

"వాడు మొన్ననేగదయ్య చెక్కమద్దెల మీంచి తోలు మద్దెల మీది కొచ్చింది! వాడేం వాయిస్తాడూ!" అన్నాడు హార్మోనిస్టు.

"ఓరి పిచ్చివాడా! నువు వాయించాలా? వాడు వాయించాలా! నేను లేనూ; నువ్వు శ్రుతి ఇవ్వు చాలు. వాడు తాళం చూపిస్తాడు. అంతే మిగతా అంతా నా కంఠం. నా సంగీతం. నేను కొట్టుకొస్తాగా" అన్నాడు దాసు.

హార్మోనిస్టు తలూపాడు.

అప్పటికప్పుడే మూహూర్తం పెట్టి, పూర్ణయ్యకి కబురెట్టి బయలుదేరిపోయారు హరికథ బృందం.

సుబ్రహ్మణ్యం నెత్తిన హార్మొనీ, పూర్ణయ్య తలపైనా మద్దెలా, దాసు తలపైన పెట్రొమాక్సు లైటు, చేత పాత్ర సామాన్లసంచితో డొంకల్ల నడుచుకుంటూ సాయం సమయానికి వూళ్ళోకొచ్చారు.

గుడి మండపం దూరం కాబట్టి, ఊళ్ళోనే రెండిళ్ళ మధ్య కాస్త ఖాళీస్థలం చూసి అక్కడ సామాన్లు దింపుకొని, వూళ్ళో కెవరో కొత్తవాళ్ళు రావటాన కుర్రకారు ఎగబడితే, "రాత్రికి హరికథ ఉందోయ్" అని వాళ్ళ చేత అక్కడ రాయీరప్పా చదునుచేయిస్తూ ఇంకోకుర్రాణ్ణి లైటులో పోయడానికి అరకాయ కిరసనాయిలు కోసం బజారుకి పురమాయించి హడావుడి చేస్తున్నాడు దాసు. "ఒరేయ్! సుబ్రహ్మణ్యం! నేను చిల్లరకొట్టు కెళ్ళి బియ్యం, పప్పూ తీసుకొస్తాను. ఆ రెండు రాళ్ళూ చేర్చి పొయ్యి చేసి వంట ప్రయత్నం చెయ్యి" అని పై కండువా దులిపి మెడ కిరుపక్కలావేసుకుని ఠీవిగా నడుస్తూ పెద్ద బజార్లో కొచ్చాడు దాసు.

అక్కడ రావిచెట్టు కింద పదిమంది బాణాకర్రలతో బుర్రమీసాలతో నుంచుని ఉన్నారు.

పోతున్న కొత్త మనిషిని "ఓయ్""అని ఏకకంఠంతో పిలిచారు.

దాసు ఆ గర్జనకి ఉలిక్కిపడి వెనక్కు చూస్తే పది బాణా కర్రలు. పైప్రాణాలు పైన పోగా, ఠీవి ఆవిరైపోగా మెడనున్న తువ్వాలు నడుంకి చుట్టుకుంటూ, చేతులు జోడించి "అయ్య! అయ్య!" అని వంగిపోతూ రావిచెట్టు దగ్గర కొచ్చాడు.

"నువ్వేగదయ్యా! దాసువి" ఉరిమినట్టన్నాడొకడు.

"చిత్తం ! చిత్తం ! సరళీస్వరాలు చక్కగా నేర్చుకున్నాను - కృతులు పాడగలను. గాత్రశుద్ధి కలవాడిని ..... "

"నోర్మూయ్? నువ్వు వెనక వచ్చావు. పంటల్లేవు. మేమేం ఇవ్వలేం. వెళ్ళి పొమ్మని చెప్పాం. మళ్ళీ వస్తావా? ఎన్ని గుండెలు."

"అయ్యా భారతంలో ఒక్కటే ..... ఒక్క కథ చెప్తాను ......"

"భారతంలో ఒక్క కథ సెప్తే వూరికరిష్టం గదంటయ్యా. పోతావా తన్ని తగిలెయ్యమంటావా....."

"లేకపోతే కుశలవ చరిత్ర ..... భీమార్జున....."

'రేయ్' అంటూ పది కర్రలూ ఒక్కసారి లేచినై. పప్పులేదు బియ్యం లేదు, ఉన్నట్టుండి పొలిమేర దాటకపోయావో చీల్చేస్తాం"

దాసు వొగరుస్తూ పరుగెత్తి వచ్చాడు.

సుబ్రహ్మణ్యం పొయ్యి రాజేసి ఎసరు పెట్టి కూర్చున్నాడు.

'దిష్టిముండాకొడక ! ఆ ఎసరు నీళ్ళతో మొహం కడుక్కో. పక్కవూరు పోదాం. ఇక్కడ కథ లేదు.' అన్నాడు దాసు.

"ఏం పోతాం, మద్దెల పూర్ణాయి కడుపునొప్పితో చూరుక్రింద పడుకున్నాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

తలపట్టుకున్న దాసు "రేప్పొద్దునే చద్దాం. ఈ పూటకి మంచినీళ్ళే గతి" అని స్తంభానికి జేరబడ్డాడు.

పదకొండు గంటలవేళ ఓ ముసలాయన లాంతరేసుకొచ్చి "ఏవయ్యా దాసూ! ఏవన్నా గతికారా లేదా." అన్నాడు.

"మహాప్రభో! పచ్చి మంచినీళ్ళు తాగి పడున్నాం"అన్నాడు దాసు.

"మా ఇంటికి రండి.బియ్యం పప్పూ ఇస్తాను" అనటమేమి చెంగున లేచాడు దాసు. అరగంటలో అన్నం పప్పూ వండాడు సుబ్రహ్మణ్యం. తెచ్చుకొన్న లోటాడు మజ్జిగతో పూర్ణయ్యతో సహా ముగ్గురూ భోజనం చేశారు. కాని దాసు

ముసలాయన్ని వదలడే? అయ్యా! మీరు నాకు అన్నంపెట్టారు. మీకు ఒక్క కథ విన్పిస్తాను. విద్వాంసుణ్ణి. కృతులు చెప్పుకున్నాను.

"నా ఒక్కడికీ అర్ధరాత్రి కతేందయ్యా"

"అయ్యా! తమరు పెద్దలు. అలా అనకూడదు..... ఒక్క కథే. త్వరగా ముగిస్తాను" అంటూ ఆ ముసలాయన్ని బందీచేసి కూర్చో పెట్టాడు.

దాసు ముఖం రుద్దాడు. పట్టె వర్ధనాలు పెట్టాడు. పట్టుపంచె కట్టాడు. కాలికి గజ్జెలు! చేతికి చిరతలు!ఎక్కడలేని సంబరంతో కథ మొదలెట్టి గొంతెత్తి గణపతి ప్రార్థన చేశాడు.

కథా ప్రారంభం చేశాడు.

'మహాజనులారా! భక్తాగ్రగణ్యులారా!'

ఉన్నదొక్క ముసలి ప్రేక్షకుడు! అయితేనేమి వెయ్యిమంది సభకి కథ చెప్తున్న ఆవేశంతో పాడుతున్నాడు. కడుపునొప్పి పూర్ణయ్య అటతాళానికి జంపెతాళం, ఆదితాళానికి రూపకం వరసలు వాయిస్తున్నాడు. హార్మొనిస్టు నిద్దరమత్తులో ఏం వాయిస్తున్నాడో తెలియదు కానీ దాసుకథ ఆపలేదు. మరీ ఆవేశంగా చెప్తున్నాడు. గంటయింది. నిద్ర పట్టని ఇద్దరు ముసలమ్మలొచ్చారు. దాంతో మరింత పొంగిపోయి వీరావేశంతో భారతయుద్ధం వర్ణిస్తున్నాడు. మరో గంటయింది. పాలో మంటూ పది బాణాకర్రలూ,యాభైమంది జనం పరుగున వచ్చారు.

వాళ్ళని చూసి కాళ్ళు చల్లబడ్డాయి దాసుకి 'అయ్యా తప్పయింది మంగళహారతి ఇచ్చేస్తాను' అన్నాడు వొణికిపోతూ.

'వొద్దు. ఆ కథ ఆపొద్దు .... చెప్పుకుంటూ వూరు దాటు. నీకేం ఇయ్యలేవయ్యా అంటే కథ మొదలేస్తావ్ ...... చెప్పుకుంటూ పద. నిన్ను సాగనంపాస్తాం ....' అంటూ ఉన్న పళాన దాసుని వాద్యగాళ్ళని లేపారు. వీధుల్లో కథ చెప్పిస్తూ వూరిబయటి దాకాతీసికెళ్ళి పొలిమేరన మంగళహారతి ఇప్పించి, దొరికిన మానెడు పెసలు, మానెడు శనగలు చెంగులో పోసి 'దాసూ! మేం పిలిచేదాకా రాకు' అని వొట్టేయించుకుని హరికథ బృందాన్ని పంపించేశారు.*